క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

సిద్దిపేటఅర్బన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)/కొండపాక(గజ్వేల్): మండలంలోని నాంచారుపల్లి, ఎన్సాన్‌పల్లి, బక్రిచెప్యాల గ్రామాలలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేటలోని 33కేవీ విద్యుత్ సరఫరా లైన్, 33కేవీ సబ్‌స్టేషన్, 11కేవీ విద్యుత్ సరఫరా లైన్‌ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో 9.30ని.ల నుంచి మధ్యాహ్నం 12.30ని.ల వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. అలాగే బెజ్జంకి ఫీడర్ మరమ్మతుల కారణంగా తోటపల్లి, దాచారం సబ్ స్టేషన్‌ల పరిధిలో మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సుధీర్‌బాబు తెలిపారు. మద్దూరులోని అన్ని గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. కొండపాకలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిర్వహణ కారణంగా కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ సత్యం తెలిపారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలుకుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ప్రతి విద్యార్థి చదువుకునే సమయంలోనే ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఆ దిశగా నిరంతరం కృషి చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, హెచ్‌ఓడీలు డాక్టర్ మల్లేశం, ఎల్‌ఎస్ రావు, శ్రీనివాస్, పోచయ్య, రహీంసుల్తానా, పాండురంగం, పీఆర్వో రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు పర్యటన



నూతన వస్త్రాలు అందజేస్తున్న హరీశ్‌రావు

హుస్నాబాద్: పట్టణంలో శుక్రవారం పలు శుభకార్యాలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హాజరయ్యారు. పర్యటనలో భాగంగా పట్టణంలోని 5వ వార్డు కౌన్సిలర్ పెరుక భాగ్యరెడ్డి నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశానికి వారు హాజరయ్యారు. అనంతరం లక్ష్మీ గార్డెన్‌లో న్యాయవాది దేవదాస్ కూతురు వివాహానికి హాజరైన నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ సీఐగా సుధాకర్‌రావు

సిద్దిపేటకమాన్: కమ్యూనికేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్‌రావు సీపీ అనురాధను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని, ఏ పోలీసు స్టేషన్‌లో సమస్య ఉన్నా వెంటనే వెళ్లి పరిష్కరించాలని ఆయనకు సీపీ సూచించారు.

220 మందికి వైద్య పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 220 మంది విద్యార్థులకు దంత వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా దంత వైద్యుడు అరవింద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తీపి పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజు రెండుసార్లు శుభ్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేశ్, వైద్యులు నవీన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌పై తీర్మానం

దుబ్బాక: రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని సీపీఎం 4 వ మహాసభలో తీర్మానించారు. శుక్రవారం నిర్వహించిన సీపీఎం మహాసభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భాస్కర్ అధ్యక్షతన పలు తీర్మానాలు చేశారు. అనంతరం పట్టణ, మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.



సిద్దిపేటరూరల్: కేక్ కట్‌చేస్తున్న పూజల హరికృష్ణ



కోహెడ(హుస్నాబాద్): రేవంత్‌రెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న శ్రీరామ్‌చక్రవర్తి

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోను సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా ప్రాంతాల్లో కేకు కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కొమురవెల్లి ఆలయంలో పూజలు నిర్వహించి వేద పాఠశాల విద్యార్థులకు పళ్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకులు హైదరాబాద్‌లో సీఎంను కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కొమురవెల్లి(సిద్దిపేట): స్వామి రాజగోపురం ఎదుట కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నేతలు



బెజ్జంకి(సిద్దిపేట): కేక్ కట్‌చేస్తున్న దామోదర్ తదితరులు



చిన్నకోడూరు(సిద్దిపేట): చర్లఅంకిరెడ్డిపల్లిలో...



మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో..

పెరుగుతున్న చలి.. జాగ్రత్తలు తప్పని సరి

- బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ వచ్చే అవకాశం
- ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్



హేమరాజ్‌సింగ్

దుబ్బాక: చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్, ప్రముఖ సర్జన్ హేమరాజ్‌సింగ్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చిన్న పిల్లలు, వృద్ధులు చలి తీవ్రత ఎక్కువ ఉన్న సమయాల్లో సాధ్యమైనంత వరకు బయటకు రావొద్దని చెప్పారు. గుండె జబ్బులు, ఆస్తమా రోగులు తప్పనిసరిగా వైద్యుల సలహాలు పాటించాలని, చలి తీవ్రతతో ఎక్కువ శాతం బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. వెచ్చటి దుస్తులు, తలకు మంకీ క్యాపులు వంటివి పెట్టుకోవాలని సూచించారు. వ్యాధుల బారిన పడ్డవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిజేస్తున్నామని, పేదలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దని హేమరాజ్ సింగ్ సూచించారు.

పీఎస్‌బీ జీవన ఎరువుతో ఎన్నో లాభాలు

ఏరువాక పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త పల్లవి

కొండపాక(గజ్వేల్): వరి సాగులో పీఎస్‌బీ జీవన ఎరువును వాడడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని తోర్నాల ఏరువాక పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త పల్లవి తెలిపారు. మండలంలోని చిన్న కిష్టాపూర్‌లో రైతు మల్లేశం ఆర్‌ఎన్‌ఆర్ కంపెనీ సన్నరకం విత్తనాలతో సాగుచేసిన వరి పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ పీఎస్‌బీ జీవన ఎరువును వాడడంతో నేలలో ఉండే భాస్వరాన్ని తొందరగా కరిగించి మొక్క వేర్లభాగానికి చేరేలా దోహదపడుతుందన్నారు. దీంతో నాటువేసే సమయంలో వాడుకునే దుక్కి మందు చల్లడం ఖర్చు తగ్గుతుందన్నారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు నూతన విత్తనాలను వాడుకుంటూ అధిక దిగుబడులు పొందాలని చెప్పారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి గోవిందరాజు, రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న పల్లవి

తల్లిదండ్రులను మించిన దైవం లేదు

రూరల్ సీఐ శ్రీను

సిద్దిపేటరూరల్/సిద్దిపేటకమాన్/చేర్యాల(సిద్దిపేట)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తల్లిదండ్రులను మించిన దైవం లేదని, వారిని బాధ్యతగా చూసుకోవాలని సీఐ శ్రీను పిలుపునిచ్చారు. పెద్ద లింగారెడ్డిపల్లిలో గురువారం రాత్రి ప్రజాచైతన్య కనువిప్పు కార్యక్రమాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలను పాటించాలని సూచించారు. ఎస్‌ఐ అపూర్వరెడ్డి, రవి, రవీందర్, ఎల్లయ్య, తిరుమలయ్య, భార్గవి తదితరులు పాల్గొన్నారు. వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఏఎస్‌ఐలు ఉమేష్, సదాశివరావు పాల్గొన్నారు. చేర్యాల మండల పరిధిలోని వేచరేణి జెడ్పీహెచ్‌ఎస్‌లో కొమురవెల్లి ఎస్‌ఐ లింగంపల్లి రాజుగౌడ్ ఆధ్వర్యంలో బాలికలు, మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎల్.శ్రీను మాట్లాడారు. విద్యార్థి దశ కీలకమని సిద్దిపేట టూటౌన్ సీఐ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని రావూస్ టెక్నో హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. హెచ్‌ఎం తిరుపతి, పోలీస్ సిబ్బంది కిషన్, మమత, వీణకుమారి, ప్రవీణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కనువిప్పు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ శ్రీను

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయమూర్తి ప్రియాంక

గజ్వేల్‌రూరల్/హుస్నాబాద్: విద్యార్థులు, ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ప్రియాంక పిలుపునిచ్చారు. జాతీయ న్యాయసేవాధికార దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని కొడకండ్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పేదలకు న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తోందని చెప్పారు. మహిళలు, పిల్లలు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహులు, హెచ్‌ఎం శ్రీనివాస్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో సివిల్ కోర్టు న్యాయమూర్తి కృష్ణతేజ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం నేరమని, విద్యార్థి దశలో చెడు అలవాట్లకు లోనుకాకుండా విద్యపైనే దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్: మాట్లాడుతున్న ప్రియాంక

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి రామాలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.40లక్షలు మంజూరు చేసింది. శుక్రవారం ఆలయ అభివృద్ధి పనులను మాజీ ఎంపీటీసీ కల్లెపల్లి వెంకటస్వామి, కర్ర రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి నిధులు విడుదల చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, చంద్రయ్య, మోహన్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న నాయకులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తూప్రాన్: డ్రగ్స్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్‌అన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని నలంద జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం–సైన్స్–మూఢనమ్మకాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రమాదాలు జరగకుండా చూడాలి

ఏసీపీ పురుషోత్తంరెడ్డి



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. కుకునూరుపల్లి పోలీస్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ క్రైంలు, దొంగతనాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. వాహనాల తనిఖీల వల్ల కొన్ని ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. డేంజర్ స్పాట్‌ల వద్ద బారికేడ్లు, ట్రాఫిక్ సిగ్నల్ బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించండి

కమిషనర్ ఆశ్రిత్



మాట్లాడుతున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: ప్లాస్టిక్ రహిత సిద్దిపేట కోసం వ్యాపారులు, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో పలువురు వ్యాపారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించాలని, ఏకోలాస్టిక్ వాడాలన్నారు. మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ అదృశ్యం

దుబ్బాకటౌన్: బోర్‌వెల్ సూపర్‌వైజర్ అదృశ్యంపై శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మిరుదొడ్డి మండలం కాసులబాద్‌కు చెందిన బిట్ల స్వామి బోర్‌వెల్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. గత నెల 10న పెద్ద గుండవెల్లిలోని తన బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ రావడంతో అతడి భార్య పూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

వ్యవసాయాధికారి శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్/మద్దూరు(హుస్నాబాద్): ఆయిల్ పామ్ సాగుకు రైతులు అంతర పంటలు సాగుచేసుకొని అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ సూచించారు. మండలంలోని ఎన్సాన్‌పల్లి, తడ్కపల్లి గ్రామాలలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను శుక్రవారం సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతుల సమస్యలకు పరిష్కారాలను చూపేందుకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కీర్తన, నవనీత, రైతులు అంజయ్య, ఆంజనేయులు ఉన్నారు. అలాగే మద్దూరు కేంద్రలోని పలువురు రైతుల ఆయిల్‌పామ్ తోటలను మండల వ్యవసాధికారి రామకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు వల్ల నాలుగేళ్ల నుంచి దిగుబడి ప్రారంభమై.. 30యేళ్ల వరకు దిగుబడి సాధించవచ్చన్నారు.



సిద్దిపేటఅర్బన్: తోటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

జ్యోతులు వెలిగించి.. భక్తితో కొలిచి

ప్రసిద్ధమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో సామూహిక కార్తీక సహస్రదీపోత్సవం నేత్రపర్వంగా సాగింది. శుక్రవారం రాత్రి శివాలయ ప్రాంగణంలో మహిళలు 1,008 జ్యోతులు వెలిగించి పరమేశ్వరుడిని భక్తితో కొలిచారు. ఆలయ యంత్రాంగం కార్తీక దీపాలను సమకూర్చింది.

– వర్గల్(గజ్వేల్):



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. జిల్లా టీఎన్‌జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రమ్‌రెడ్డి కూతురు శుభకృతిక జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు సురేశ్‌కుమార్, లలిత, సునీత, వాణి పాల్గొన్నారు.



వాటర్ బాటిళ్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొనసాగుతున్న సమగ్ర సర్వే



ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న సర్వే సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబసర్వే పట్టణ పరిధిలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా సర్వే నిర్వహించిన సిబ్బంది ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటిస్తున్నారు. పట్టణ పరిధిలోని వార్డుల్లో పర్యటిస్తున్న మెప్మా ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి స్టిక్కర్లు అంటిస్తున్నారు.

కళాశాలలో 'క్లీన్ అండ్ గ్రీన్'



చెత్తా చెదారం తొలగిస్తున్న విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అధ్యాపకులు, విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆవరణలో చెత్తచెదారాలను తొలగించారు. గుంతలు పూడ్చారు. ఖాళీ స్థలంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత పాటించాలని సూచించారు. వెంకటకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కథల పోటీల్లో విద్యార్థి ప్రతిభ**



విశ్వతేజ

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కథల పోటీలలో మండల పరిధిలోని అనంతసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి బి.విశ్వతేజ ప్రతిభ చూపాడు. 15న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారని హెచ్‌ఎం జ్యోతి తెలిపారు.

◆ **ఎస్సీల ఐక్యతతోనే ఆర్థిక ప్రగతి**

హుస్నాబాద్‌రూరల్: ఎస్సీ ఉపకులాల ఐక్యతతోనే ఆర్థిక ప్రగతి సాధించవచ్చని మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ ఆరె కిశోర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం నియోజకవర్గం ఎల్కతుర్తికి చేరింది. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడారు. కిష్టస్వామి, బాలయ్య, రాములు, సుమన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **చిన్నారులను పనిలో పెట్టడం నేరం**

దుబ్బాకటౌన్: బడిఈడు పిల్లలను పనిలో పెట్టడం చట్టరీత్యా నేరమని, వారిని పాఠశాలలో చేర్పే బాధ్యత తల్లిదండ్రులదేనని బాలల పరిరక్షణ కౌన్సిలర్ నర్సింహులు అన్నారు. మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల రక్షణ, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏ సమస్య వచ్చినా 1098 నంబర్ కాల్‌చేసి సమాచారం అందించాలని సూచించారు.

◆ **ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి గాయాలు**

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది నవీన్, నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నరేశ్, బాబు ఇద్దరు కలిసి వ్యవసాయ క్షేత్రం నుంచి ట్రాక్టర్‌ను తీసుకుని వస్తున్నారు. మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో గాయపడిన వారిని సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

◆ **ఆన్‌లైన్ విధానం వల్ల పని ఒత్తిడి**

గజ్వేల్‌రూరల్: ఆన్‌లైన్ విధానం వల్ల అంగన్‌వాడీ టీచర్లకు పని ఒత్తిడి పెరిగిందని, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో ఎల్లయ్య, వెంకటచారి, స్వప్న, వనజ, ఉమ, మంజుల, నిర్మల, సంధ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోదండ కిష్టయ్యకు మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీ పత్రాలను బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు చిలివేరి మల్లారెడ్డి శుక్రవారం అందజేశారు. కిష్టయ్య కొన్ని రోజుల క్రితం నిమ్స్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ కనకయ్య, నాయకులు రవీందర్, పులీంధర్‌రెడ్డి, నర్సింహులు ఉన్నారు.

◆ **ఓటరు నమోదు సద్వియోగం చేసుకోవాలి**

కోహెడ(హుస్నాబాద్): 18యేళ్లు నిండిన వారంతా ఓటరు జాబితాలో పేరు నయోదు చేసుకోవాలని తహసీల్దార్ సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నార. ప్రత్యేక ఓటరు జాబితా నమోదు కోసం కార్యాలయంలో శని, ఆదివారం బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. నూతన ఓటరు నమోదు కోసం ఫామ్–6, సవరణ కోసం ఫామ్–8 ద్వారా అర్జీలు సమర్పించాలన్నారు.

◆ **రేపు బీడీ కార్మిక సంఘం మహాసభలు**

చేర్యాల(సిద్దిపేట: జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే 10న ఏఐటీయూసీ బీడీ కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో మహాసభ కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. బీడీకార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అశోక్, భూమయ్య, సిద్ధయ్య, ప్రేమ్, వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

◆ **మాతృమూర్తుల సమ్మేళనం**

సిద్దిపేటకమాన్: మాతృమూర్తుల సమ్మేళనాన్ని పదో తేదీన నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట మాతృ మండలి సభ్యులు తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సిద్దిపేటలో నిర్వహించనున్న ఈ సమ్మేళనంలో మాతృమూర్తి పాత్ర, పిల్లలను ఎలా పెంచాలి అనే అంశాలను వివరించనున్నట్టు చెప్పారు. సమ్మేళనంలో మాతృమూర్తులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వాసవి, పద్మ, వనజ, జ్యోతి, సౌమ్య పాల్గొన్నారు.